# “ఆయన మహిమను మేము చూచితిమి”

## మత్తయి 17:1 - 8; మార్కు 9:2 - 8; లూకా 9:28 - 36, పరిశీలన

మూడు సంవత్సరములుగా క్రీస్తును అనుసరించిన అపొస్తలుడు నీవైనట్టు భావించు. నీవు చూచిన అద్భుతమైన దృశ్యాలను పరిగణించు: అయిదువేల మందికి ఆహారం పెట్టడం, నీళ్లమీద నడవడం, తుఫానును అణచడం, మృతులను లేపడం వంటివి నీ కన్నుల ముందు జరిగాయి. “నేను చూచినవాటన్నిటిలో నన్ను ఆకట్టుకున్నవేవి?” అని యిప్పుడు నిన్ను నీవు ప్రశ్నించుకో. ఆ ప్రశ్నకు నీవు ఎలా బదులిస్తావో నాకు తెలియదు, ఆయన రూపాంతరమును చూడగలిగిన ఆధిక్యతను కలిగిన అపొస్తలుల మనస్సులో అది చెరగని ముద్రవేసింది. అక్కడ ఉన్నవారిలో ఒకడు దాన్ని యిలా వర్ణించాడు,

> ఏలయనగా చమత్కారముగా కల్పించిన కథలను అనుసరించి మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మ్యమును మేము కన్నులార చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియ కుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్యమహిమ నుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన పొందగా మేము ఆ పరిశుద్ధ పర్వతము మీద ఆయనతో కూడ ఉండినవారమై ఆ శబ్దము ఆకాశమునుండి రాగా వింటిమి (2 పేతురు 1:16–18).

అక్కడున్నవారిలో మరియొకడు యిలా వ్రాశాడు,

> ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను (యోహాను 1:1).

> ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:14).

రూపాంతరము కంటెను మించినది ఈ రచయిత మనస్సులో ఉండియుండ వచ్చును (యోహాను 2:11 చూడు), కాని “ఆయన మహిమను కనుగొంటిమి” అనే అతని ప్రతిపాదనలో మరపురాని ఆ సంఘటన తప్పక ఇమిడియుంటుంది (లూకా 9:31, 32ను చూడు).

రూపాంతరాన్ని గూర్చి మనం చదివేటప్పుడు,[1] మన ప్రాథమిక లేఖన భాగం మత్తయి 17; అయితే అవసరమైన వివరాలకు మనం మార్కు 9, లూకా 9లకు వెళ్లుదాం. ఆయన మహిమను చూచునట్లు యిది మనకు సహాయపడును గాక.

## ముఖ్యమైన సంఘటన

## (మత్తయి 17:1, 2; మార్కు 9:2, 3; లూకా 9:28, 29)

మన లేఖన భాగం యిలా ప్రారంభమౌతుంది, "ఆరు దినములైన తరువాత యేసు పేతురును యాకోబును అతని సహోదరుడైన యోహానును వెంటబెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారి యెదుట రూపాంతరము పొందెను" (మత్తయి 17:1).[2] ఆరు దినాలకు ముందు ఏమి జరిగింది?

దాదాపు ఒక వారం ముందుగా, పేతురు మంచి ఒప్పుకోలును చేసాడు, మరియు క్రీస్తు తన సంఘాన్ని కట్టడానికి వాగ్దానం చేశారు (మత్తయి 16:16, 18).[3] ఆ వాగ్దానాన్ని నెరవేర్చడానికి గాను ఆయన మరణించవలసియుంది: "అప్పటినుండి తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దలచేతను ప్రధానయాజకులచేతను శాస్త్రులచేతను అనేక హింసలుపొంది, చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలు పెట్టగా ..." (మత్తయి 16:21). యెరూషలేమునకు వెళ్లి భౌతికమైన రాజ్యమును స్థాపించుటకు బదులుగా – ఆయన యెరూషలేమునకు మరణించ వెళ్లుచున్నాడు – తన శిష్యుల మనస్సులో ఉన్నదానికి యిది భిన్నమైనది.

క్రీస్తు మాటలను ఆయన శిష్యులు గ్రహించలేదు; రాజ్యమును గూర్చి వారికున్న భావనకు మెస్సీయ మరణము సరిపోలేదు. "పేతురు ఆయన చేయిపట్టుకొని – ప్రభువా, అది నీకు దూరమగునుగాక, అది నీకెన్నడును కలుగదని ఆయనను గద్దింపసాగెను" (మత్తయి 16:22). క్రీస్తు పేతురును తరువాత శిష్యులందరినీ మందలించారు (మత్తయి 16:23–27; మార్కు 8:38; లూకా 9:26 చూడు).

ఆరు దినాల దీర్ఘ కాలంలో – క్రీస్తు ఆయన అనుచరుల మధ్యగల ఆందోళను ఊహించు – ఆ దినాల్లో ఏమి జరిగిందో రికార్డు ఏమి లేదు. కడకు, ఆరు దినాల తరువాత, త్వరపడి మాట్లాడే పేతురుతో చేర్చి ముగ్గురు అపొస్తలులను ఆయన ఎత్తయిన కొండమీదికి తోడుకొనిపోయెను.

ప్రభువైన యేసు ఆ ముగ్గురిని మాత్రమే ఎందుకు తోడుకొనిపోయెనో మనకు చెప్పలేదు. అయితే పలు సందర్భాలలో ఆయన వారిని తక్కిన అపొస్తలులనుండి వేరు చేశారు (మార్కు 5:37; 9:2; 14:33). భవిష్యత్తులో వారు ఎదుర్కోబోయే పరిస్థితులను ఎదురుచూచి ఆయన యిలా చేసి ఉంటారేమో.[4] ఈ ముగ్గురి ద్వారా తక్కిన తొమ్మిది మందిని సులువుగా చేరవచ్చునని తలంచియుంటారేమో. యేసు మానవునిగా ప్రత్యేకమైన స్నేహితులను కలిగి ఉండాలని తలంచియుంటారేమో. ముగ్గురిలో ఒకడైన యోహాను "యేసు ప్రేమించిన శిష్యుడని" మనకు తెలుసు (యోహాను 21:20; 13:23; 19:26; 20:2లను చూడు).

వారు ఏ పర్వతాన్ని ఎక్కారో కూడా మనకు తెలుపలేదు.[5] అది గలలియలోని టాబోరు పర్వతమని, దైవప్రేరేపితం కాని పరంపరం అంటుంది, కాని అది హెర్మోను పర్వతమైయుండే అవకాశం ఉంది. పేతురు ఒప్పుకున్న మంచి ఒప్పుకోలు[6] జరిగిన చోటికి అది ఎక్కువ దూరంలో లేదు. పాలస్తీనాలో; హెర్మోను పర్వతమే అన్నిటికంటే మిక్కిలి ఎత్తయిన పర్వతం. దాని "మంచు శిఖరములు లోయ" ఉపరితలమునకుపైన "రమారమి పదివేల అడుగుల ఎత్తుగా ఉంటాయి."[7]

యేసు పర్వతం మీదికి వెళ్లడానికి కారణం రూపాంతరం పొందడానికి కాదు. అది తన తండ్రితో సంభాషించడానికి. లూకా యిలా దాఖలు చేశాడు: "... ఆయన పేతురును యోహానును యాకోబును వెంట బెట్టుకొని, ప్రార్థన చేయుటకు ఒక కొండ యెక్కెను" (లూకా 9:28). ప్రార్థనా జీవితాలను పెంచుకునేలా ఆయన తన అపొస్తలులకు సహాయము చేయగోరి యుండవచ్చు, – అయితే, తరచుగా జరుగుతున్నట్టు, ప్రార్థనా వేళల్లో నిదురలోకి జారారు (లూకా 9:32; మత్తయి 26:40, 43, 45లను చూడు).

అప్పుడు, హఠాత్తుగా, "ఆయన ప్రార్థించుచుండగా ఆయన ముఖరూపము మారెను" (లూకా 9:29ఎ; మత్తయి 17:2ఎ). "రూపాంతరము" అనే పదం "ముఖ్యమైన మార్పులు" అని అర్థ మిచ్చే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది.[8] రూపాంతరం యొక్క పరిమాణాన్ని మాటలలో వర్ణించలేం. దాని పరిణామాన్ని సమాన పదాలతో సువార్త లేఖికులిలా వర్ణించారు.

> (ఆయన) వారి యెదుట రూపాంతరము పొందెను. ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను, ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను (మత్తయి 17:2).

> అంతలో ఆయన వస్త్రములు ప్రకాశమానమైనవియు మిగుల తెల్లనివియు ఆయెను; లోకములో ఏ చాకలియును అంత తెల్లగా చలువచేయలేడు[9] (మార్కు 9:3).

> "... ఆయన ముఖరూపము మారెను; ఆయన వస్త్రములు తెల్లనివై ధగధగ – మెరిసెను ..." (లూకా 9:29).

జరిగిన దానిని యిలా సూచించే అవకాశముంది: యేసు దేవ – మానవుడు (మత్తయి 1:23). అయితే ఆయన ఈ భువిపై సంచరించుచుండగా, అధిక సంఖ్యాకులు కేవలం ఆయన మానవత్వాన్ని మాత్రమే తిలకించారు. అయినా, ఈ ప్రత్యేకమైన సందర్భంలో, ఆయన దైవత్వం మనుష్యత్వం ప్రకాశించే అవకాశం కలిగింది. కొద్దిమందికి కలిగిన ఆయన దైవత్వపు క్షణికదర్శనం పేతురు, యాకోబు, యోహానులకు లభించింది.[10]

## మనస్సున నాటిన ఉద్దేశం

## (మత్తయి 17:3 - 8; మార్కు 9:4 - 8; లూకా 9:30 - 36)

మన పఠనం ముందుకు సాగుతూ ఉండగా, "రూపాంతరం యొక్క ఉద్దేశం

ఏమైయుంటుంది?" అని మనం అడుగగోరతాం. ఈ విశేషమైన సంఘటన సంభవించ డానికి నాలుగు తగిన కారణాలను తెలియజేయనిమ్ము.

## మానవత్వం కిరీటాన్ని ధరించింది

క్రీస్తు జీవితంలో మాటిమాటికి, విశేషమైన సంఘటనలు గతాన్ని ఘనపరచి, భవిష్యత్తు కొరకు మార్గం సిద్ధపరచాయి. అట్టివాటిలో ఆయన బాప్తిస్మ మొకటి. క్రీస్తు యొక్క గత ముప్పది సంవత్సరాల జీవితానికి దేవుడు అప్పుడు ఆమోద ముద్ర వేశాడు. మిగిలిన మూడున్నర సంవత్సరాల బహిరంగ పరిచర్యకు ఆయనను సిద్ధపరచడానికి పరిశుద్ధాత్మ ఆయన మీదికి దిగివచ్చాడు (మత్తయి 3:16, 17). రూపాంతరము మరొక శిఖరాగ్రపు సంఘటన. ఆ సందర్భంలో, క్రీస్తు యొక్క సిద్ధపాటు మీదనేగాక, తన పరిచర్య సంవత్సరాల మీద కూడ దేవుడు తన "అంగీకారపు ముద్ర"ను వేశాడు (మత్తయి. 17:5).

భూమిపై నరుని ఆయన నిలిపినప్పుడు, నరుడు క్రీస్తువలె ఉండాలని దేవుడు కోరుకున్నాడు. ప్రజలు పాపం చేశారు, కాని క్రీస్తు పాపంచేయలేదు (ఆది. 3:5; రోమా 3:23; హెబ్రీ. 4:15). భూమిమీద ఆయనకు మరి ఏ యితర కార్యక్రమం లేక యుండినట్టయితే, ఆరోహణ సమయంలో, తానున్న రూపంలోనే క్రీస్తు తిరిగి దేవుని సముఖానికి వెళ్లియుండగలిగేవాడే. ఆయన రూపాంతరానికి నడిపే రెండవ కారణం మరొకటి ఉందనుకో.

## "నిర్గమనం" స్థిరపరచబడింది

లూకా యిలా వ్రాశాడు: "పేతురును అతనితోకూడ ఉన్నవారును నిద్రమత్తుగా ఉండిరి, వారు మేల్కొనినప్పుడు, ఆయన మహిమను ... చూచిరి" (లూకా 9:32). పేతురు, యాకోబు, యోహానులు కలలు కనలేదని లేఖికుడు (లూకా) మనలను ఎరుగ గోరాడు. యేసు ప్రత్యక్షతతో వారి కన్నులు మిరుమిట్లు గొలిపాయి.

వారిని ఆశ్చర్యపరచేది యింకా కొంత ఉంది: "మరియు ఇద్దరు పురుషులు ఆయనతో మాటలాడుచుండిరి, వారు మోషే, ఏలీయా[11]" (లూకా 9:30).[12] మోషే ఏలీయాలు యూదా మత విశ్వాసానికి మహా నాయకులై ఉండిరి (హెబ్రీ. 11:23-29; యాకోబు 5:17). పేతురు, యాకోబు, యోహానులు తమ తండ్రుల పాదాలవద్ద వారిని గూర్చి గొప్ప కథలు వినియుంటారు. రబ్బీలచే వారి పేర్లు ఘనపరచబడినవిగా వినియుంటారు. మోషే గొప్ప ధర్మశాస్త్రాన్ని యిచ్చినవాడు; ఏలీయా జనులను తిరిగి ధర్మశాస్త్రం వైపు రప్పించ పిలుపు నిచ్చినవాడు[13] రూపాంతరం పొందిన కొండమీద ప్రభువుతో కూడ ఉండడానికి ఎందుకు వారిద్దరికి ఆధిక్యత లభించిందో మనకు తెలియదు. పాత నిబంధన ప్రవచనంలో వారిద్దరు మెస్సీయాతో పోల్చబడి యున్నందుకు కాబోలు (ద్వితీయో. 18:15; మలాకీ 4:5, 6).[14]

యేసు, మోషే, ఏలీయాలకు దగ్గర సంబంధం ఉన్నట్టు గోచరిస్తుంది; వారు అనేక

అంశాలు చర్చించి ఉండవచ్చు. వాగ్దాన భూమికి వెళ్లే అనుమతి మోషేకు లేదు (సంఖ్యా. 20:12), మరియు ఏలీయా గలిలయ గడ్డి మైదానాల మీద సంచరించి శతాబ్దాలు గడిచిపోయాయి. ప్రభువు దేశంగుండా ప్రయాణంచేసే సంగతులను గూర్చి మాట్లాడు కుంటూ వారు ఆనందించి ఉండవచ్చు. వారి ముగ్గురికి నాయకత్వపు కష్టాలు తెలుసు. బహు ప్రాథమిక సత్యాలను తెలుప ప్రయత్నించడంలో ఎలా అలసి పోయే పరిస్థితి యుంటుందో వారు చర్చించియుండవచ్చు.[15] అయినా, వారి చర్చ యిట్టివాటిని గూర్చిగాని వీటిని పోలిన సంగతులను గూర్చిగాని కాదు.

లూకా ప్రకారం, "వారు మహిమలో అగపడి, ఆయన యెరూషలేములో నెరవేర్చబోవు నిర్గమమును[16] గూర్చి మాటలాడుచుండిరి" (లూకా 9:31). ద్వారముల మీద ఉండే "EXIT" గుర్తును ఆలోచించు. ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచి వాగ్దాన భూమికి వెళ్లే దాని గురించి ఆలోచించు. లూకా 9లోని "నిర్గమము" అనే పదము మరణము, పునరుత్థానము, ప్రభువు యొక్క ఆరోహణము అనేవి యిమిడియున్నాయి.[17] క్రీస్తు ఈ జీవితంనుండి, కడకు ఈ లోకంనుండి వెడలిపోయే విషయాన్ని గూర్చి తేటగా చర్చింప బడింది.

మోషే ఏలీయాల మనస్సులో రాబోయే క్రీస్తు సిలువ మరణం నిండిందని నీవెందుకు ఊహిస్తావు? వారి హేతువు కర్తవ్యానికి సంబధించినదై యుండవచ్చు. ప్రయాస పొందిన సంవత్సరాలు ఈ సంఘటననే సూచించాయి. మోషే ధర్మశాస్త్రాన్ని యిచ్చిన ఉద్దేశం జనులను క్రీస్తు నొద్దకు నడిపించడానికే (గలతీ. 3:16, 19, 24, 25). మెస్సీయ ఎవరి ద్వారా వస్తాడో ఆ ప్రజలను సిద్ధపరచడానికి ఏలీయా ప్రయాసపడ్డాడు. ప్రవక్తల ప్రకారం, క్రీస్తు/మెస్సీయ ప్రజలకొరకు చనిపోవాలి (యెషయా 53:4-6).

అయినా, యేసు మరణంలో మోషే ఏలీయాలకు ఉన్న ఆసక్తికి వ్యక్తిగతమైన కారణం ఉండి ఉండవచ్చు: ఆయన మరణించకుండ వారు పరలోకానికి వెళ్లడానికి వీలుండదు! మొదటి నిబంధన కాలములో[18] జరిగిన అపరాధములనుండి విమోచనము కలుగుటకు ఆయన మరణము పొందనైయున్నాడు (హెబ్రీ. 9:15). పిలువబడినవారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన క్రొత్త నిబంధన వాగ్దానము పొందుటకు ఆయన మధ్యవర్తిగా ఉన్నాడు. "యేసు రక్తము యిరువైపులకు – అనగా వెనుకకు ముందుకు ప్రవహిస్తుంది."

ఈ విధంగా, క్రీస్తు మరణంలో న్యాయమైన అక్కర వారికుంది, తాను ఉన్న రీతిగనే క్రీస్తు పరలోకానికి ఎక్కివెళ్లియుండేవాడేనని మనం గుర్తించాం – అయితే, ఆయన అలాగే చేసియుండియున్నట్టయితే, మానవ దేహంలో పరలోకమందుండే వాడు ఆయన ఒక్కరే అయ్యుండేవారే! మోషే పరలోకం వెళ్లకముందు ఆయన మరణించవలసి యుంటుంది! ఏలీయా పరలోకం వెళ్లకముందు ప్రభువు మరణించవలసి యుంటుంది! అందువలన, ఈ చర్చ పాత నిబంధనలోని యిద్దరు యోగ్యులకు ఎంతో ఆసక్తిని కలిగించేలా ఉంటుంది.

ఈ మాటలు ప్రభువుకు కూడా ముఖ్యమైయుంటాయి. సిలువకు వెళ్లకుండునట్లు నిరాశపరచడానికి ఆయన శిష్యులు ప్రయత్నించారు (మత్తయి 16:22). మానవ రక్షణకొరకు దేవుని సంకల్పంనుండి ఆయనను ఏదియు తప్పించకుండునట్లు మోషే

ఏలీయాలు ఆయనను ప్రోత్సహించారనడానికి ఏ సందేహము లేదు. ఈ విధంగా, రూపాంతరము గతాన్ని ఘనపరచడం మాత్రమేగాక, భవిష్యత్తుకొరకు అది క్రీస్తును – సిలువకొరకు – సిద్ధపరచింది.

**అధికారము నిర్వచింపబడింది**

రూపాంతరానికి ఉండే ప్రాథమికమైన ఆ రెండు ఉద్దేశాలతోపాటు, యితర కారణాలను ప్రస్తావించవలసిన ఆ సందర్భంలో క్రీస్తు యొక్క అధికారం నిర్వచింపబడింది.

వారు చూచినదానిని బట్టి శిష్యులు భయపడ్డారు (మార్కు 9:6) – భయపడినా లేకున్నా, పేతురు మాత్రం ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటాడు.[19] "అప్పుడు పేతురు – ప్రభువా, మన మిక్కడ ఉండుట మంచిది, నీకిష్టమైతే ఇక్కడ నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదుమని యేసుతో చెప్పెను" (మత్తయి 17:4). "తాను చెప్పవలసినదేమో అతనికి తెలియలేదు," అని మార్కు గుర్తించాడు (మార్కు 9:6). "తాను చెప్పినది తానెరుగకయే చెప్పెను" అని లూకా దాఖలు చేశాడు (లూకా 9:33). ఏమి చెప్పాలో పేతురుకు తెలియలేదు. అతడు మాట్లాడిన తరువాత, తానేమి చెప్పాడో అతడు గ్రహించలేదు!

ఆ స్థలాన్ని నిర్దేశించి చెప్పినప్పుడు తానేమి అంటున్నాడో పేతురుకు గ్రాహ్యం కాలేదు: "ప్రభువా, మన మిక్కడ ఉండుట మంచిది ... యిక్కడ మూడు పర్ణశాలలు కట్టుదు"మన్నాడు ఇంతకు పేతురు సమాచారమేమంటే – "నేను మెస్సీయాగా నేను వీక్షించింది ఖచ్చితంగా యిలాగే! గనుక, యెరూషలేము వెళ్లడం మరచిపో, అక్కడ మరణం వేచియుంది, మహిమ నీ చుట్టు ఎక్కడ ఆవరించియుందో ఆ ఈ పర్వతం మీద మనం ఉండిపోదాం." క్రీస్తు అక్కడే ఉండిపోయి ఉన్నట్టయితే, క్రీస్తు మన పాపముల నిమిత్తము చనిపోలేదన్న సంగతిని గ్రహించలేదు. (1 కొరింథీ. 15:3) మరియు మనమందరం నశించిపోయి ఉండేవారమే (హెబ్రీ. 9:22బి)!

మోరటైన పర్ణశాలలను అక్కడ కడతామని పేతురు ప్రతిపాదించడంలో, అతడేమి చెప్తుతున్నాడో అతనికే తెలియలేదు:[20] "మేము నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు మూడూ పర్ణశాలలు కట్టుదు" మనడంలో[21] అతడేమి ఆలోచి స్తున్నాడో! వారిని ఆపే ప్రయత్నం చేయకుండ పేతురు మోషే ఏలీయాలను వదిలేలా లేడు. వారిని ఆకర్షించడానికి అతడు పడే ప్రయాస – వారికి మూడు పర్ణశాలలు కట్టడమే – వారికినీ క్రీస్తుకునూ వారు చేసే ఏర్పాటు చెట్లకొమ్మలతో కట్టే మకామే.[22] ఇది ఎంత అర్థరహితమైనదో యోచించు; చెట్టుకొమ్మల ఆశ్రయంవలన ఆత్మ జీవులకు ఎలాటి ఉపయోగముంటుంది?

ప్రత్యేకించి ప్రభువుతో సాటిగా మోషే ఏలీయాలను నిలిపి మాట్లాడడంలో పేతురు ఏమి అంటున్నాడో అతనికే తెలియదు: "నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదు"మన్నాడు. అంటే, అనేకమంది గొప్ప బోధకులు ఆత్మ సంబంధమైన నాయకులలో యేసు ఒకడని వారి మనస్సులో ఉండిపోయింది.[23] యేసు, మహమ్మదు, బుద్ధుడు, వగైరాలకు పలురకాలైన పర్ణశాలలు నిర్మించడంలో

వారు సంతోషపడతారన్నమాట. పేతురు సలహాకు వారు దేవుని జవాబును పొందవలసి యున్నారు: “అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడని యొక శబ్దము మేఘములోనుండి పుట్టెను” (మత్తయి 17:5).

దేవుని మాటలు దైవికమైన గుర్తింపునిస్తున్నాయి: “ఈయన నా ప్రియ కుమారుడు.” అవి దైవికమైన అంగీకారాన్ని సూచిస్తున్నాయి: “ఈయనయందు నేనానందించుచున్నాను.” అవి దైవికమైన బాధ్యతను, సూచిస్తున్నాయి. “ఈయన మాట వినుడి”! అంటే, “మోషే మాట కాదు; ఏలీయా మాట కాదు; యేసు మాట వినండి!”[24] ప్రత్యేకమైన దేవుని ప్రవక్తగా భావించబడే మరి యింకెవని మాట కూడా నేడు మనం వినకూడదు.

**అపొస్తలులు సిద్ధపరచబడ్డారు**

నాల్గవది, మత్తయి 17:5లోని దేవుని మాటలు అపొస్తలులకు ప్రత్యేకమైన ప్రాముఖ్యతను కలిగి ఉండియుండవచ్చు. రానున్న ప్రభువు మరణాన్ని వారు ప్రతిఘటిస్తున్నారు (మత్తయి 16:21, 22). ఈ సందర్భంలో పేతురుకు దేవుని మాటలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. “మీకు అర్థంకాక పోయినా, మీకు అంగీకారం కాకపోయినా, యేసు మాటలు ఆలకించండి” అనే సందేశాన్ని అవి వినిపించాయి. ఆయనకు బాగా తెలుసు. మేలుగా కనబడే మార్గం కడకు మరణానికి దారితీయవచ్చు (సామె. 14:12; 16:25).

మేఘంలోనుండి స్వరం వచ్చినప్పుడు; “శిష్యులు ఈ మాట విని మిక్కిలి భయ” పడ్డారు (మత్తయి 17:6). ప్రభువు మెల్లగా వారిని ముట్టి – “భయపడకుడని చెప్పెను” (మత్తయి 17:7). వారు కన్నులెత్తి చూడగా, “యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేదు” (మత్తయి 17:8).

జరిగినవాటన్నిటిలో గప్తమైనదేదో అపొస్తలులకు తెలియరాలేదు, కాని వారు మాత్రం క్రీస్తు దైవత్వాన్ని కన్నులార చూచారు. యేసు యెరూషలేములో మృతిపొందాలన్న సంగతిని మోషే ఏలీయాలు స్థిరపరచారు. పరిశుద్ధాత్మ ఈ సంగతులన్నిటిని తగిన కాలంలో వారి జ్ఞాపకానికి తెస్తాడు (యోహాను 14:26); అప్పుడు పజిల్ అంతా సర్దుకుంటుంది.[25] వారు రాబోవు దానికి కొంత సంసిద్ధంగా ఉన్నారు.

## ముగింపు

ఆ పర్వతంమీద మహిమపరచబడిన ప్రభువును తిలకించడంలో వారికి ఆనందదాయకంగా ఉండియుండవచ్చును గదా? మనకు ఆలాటి అనుభవం ఎన్నడు కలుగదు కాని, మనం నమ్మకంగా ఉన్నట్టయితే, ఒకనాడు మహిమలో ఆయన్ను చూస్తాం! “ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన ఉన్నట్టుగానే ఆయనను చూతుము” (1 యోహాను 3:2). ఒకనాడు, పరలోకంలో మనము మోషే ఏలీయాలను కూడా చూస్తాం!

మనం ఆయన మాట వింటామో లేదో అనే ప్రశ్న ఉంది. దేవుని మాటలు మన చెవులలో గింగురుమంటూ ఉండనిమ్ము: “ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి” (మత్తయి17:5బి). నమ్మమని ఆయన చెప్పిన మాటలను ఆలకించుము (యోహాను 3:16; 8:24). మారుమనస్సు పొందుమనే ఆయన మాట వినుము (లూకా 13:3). ఆయనను ఒప్పుకొనుమన్న ఆయన మాట ఆలకించుము (మత్తయి 10:32, 33). బాప్తిస్మం పొందుమని ఆయన చెప్పిన మాటను ఆలకించు (మార్కు 16:15, 16). అనుదినం క్రైస్తవ జీవితం జీవించుమని ఆయన చెప్పిన మాటను ఆలకించు (లూకా 9:23), ఆయన మాటనాలకించి – నేడు ఆయన చిత్తాన్ని జరిగించుము!

---

సూచనలు

[1]G. Campbell Morgan, *The Crises of the Christ* (New York: Fleming H. Revell Co., 1936), 215 – 67 అనేది దీని ప్రాథమిక మూలం. [2]మార్కులోకూడ “ఆరు దినాల తరువాత” (మార్కు 9:2) అని ఉంది. లూకాలో మాత్రం “ఈ మాటలు చెప్పినది మొదలుకొని రమారమి యెనిమిది దినములైన తరువాత” అని ఉంది (లూకా 9:28). “రమారమి” అనే పదంతో సమస్య ఉండే అవకాశంలేదు. [3]ఆరు దినములకు ముందు జరిగిన దానిని గూర్చిన సంక్షిప్త వర్ణనను వివరించు. [4]ఉదాహరణకు, పేతురు తన నాయకత్వాన్ని వృద్ధిచేసికోవలసియుంది, యాకోబు హతసాక్షియైయుండ సిద్ధపడవలసి యుంది (అపొ. 12:2). [5]పేతురు దీనిని “పరిశుద్ధ పర్వతము”అని అన్నాడు (2 పేతురు 1:18). [6]దేశపటాన్ని చూడు. [7]Gordon Powell, *Difficult Sayings of Jesus* (N.p.: Fleming H. Revell Co., 1962), 63. [8]గొంగళి పురుగునుండి సీతాకోక చిలుక వచ్చే మార్పును ఆలోచించు. ఈ పదం క్రొత్త నిబంధనలో రెండు మార్లు ఉపయోగింపబడింది. ఆత్మసంబంధమైన అంతరంగపు మార్పును గూర్చి తెలిపింది (2 కొరింథీ. 3:18; రోమా 12:2) (Will Ed Warren, Class Syllabus, The Life of Christ: The Synoptic Gospels, Harding University, 1991, 71). [9]వస్త్రములను తెలుపు చేయుటకు ఉపయోగించు వాటిని గూర్చి ఆలోచించు. [10] అప్పుడప్పుడు, ఆయన దైవత్వంయొక్క క్షణిక దర్శనాన్ని మనుష్యులు పొందియుండవచ్చు అందుకే దేవాలయాన్ని ఆయన రెండుసార్లు శుద్ధీకరించినప్పుడు ఎందుకు ఎవడును ఆయనను ఆటంకపరచలేదో యిది వివరిస్తుంది.

[11]రెండు ఆయా భాషలో పేర్ల రూపం నానా రకాలుగా ఉన్నాయి. [12]మోషే ఏలీయాలు పేతురుకు ఎలా తెలుసు? దైవికమైన అవలోకనం వారు పొందియుండవచ్చు, వారి పేర్లను ప్రభుపు ఉచ్చరిస్తూ ఉండవచ్చు. లేఖనం ఈ సంగతిని చెప్పదు. మరణించిన తరువాత కూడ మోషే మోషేగాను, ఏలీయా ఏలీయాగాను ఉన్నారు. [13]వారి జీవిత విశేషాలను వివరించుటకు సమయం తీసుకో. [14]మోషే ధర్మశాస్త్రానికీ ఏలీయా ప్రవక్తలకునూ ప్రతినిధులుగా ఉన్నట్టు అనేకులు ఊహించారు.(యోహాను 1:45; లూకా 24:44 చూడు; ద్వితీయో. 34:6; మోషేను; 2 రాజులు 2:11) (ఏలీయాను సూచిస్తునాయి). [15]ఈ సంభాషణ ఎలా జరిగియుండవచ్చో నేను ఊహిస్తున్నాను: “నిదానంగా నేర్చుకొను శిష్యులను గూర్చి చెప్పనివ్వు” అని యేసు అన్నట్టు, “మొండి ఇశ్రాయేలీయులను గూర్చి చెప్పనివ్వు” అని మోషే అన్నట్టు, “అవన్నీ ఏమీ లేదు! ఆహాబు, యెజెబెలులను గూర్చి” చెప్పనివ్వు అంటాడు. [16]KJVలో “మరణించిన” అని ఉంది. [17]గ్రీకు పదం exodon-exodosకు కర్మరూపం. పేతురు ఈ పదాన్ని తన సొంత మరణానికి వినియోగించాడు (2 పేతురు 1:15). [18]కొన్నిసార్లు మంచి సమరయుని ఉదహరణ ఉపయోగింపబడుతుంది. “మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్లవానికిచ్చి – ఇతని పరామర్శించుము, నీవేమైనను ఖర్చు చేసినయెడల నేను మరల వచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పి పోయెను” (లూకా 10:35). ఆ గాయపడినవాడు బాగుపడి అక్కడనుండి వెళ్లిపోవునప్పుడు, అప్పు సంగతి ఏమని అడిగితే, “ఆందోళనపడకు, అది చెల్లింపబడిందిలే” అన్నాడనుకో, బాకి సమరయుడు తిరిగి వచ్చి చెల్లిస్తాడనే ఎదురుచూపుతోనే అది చేయబడింది. [19]నేను పేతురులా ఉంటాను. అనేక మార్లు ప్రజలు అనాలోచనగానే మాట్లాడతారు. [20]పర్ణశాలలనే పదం – పర్ణశాలల పండుగకు వేసుకొనే తాత్కాలిక మకామును సూచిస్తుంది.

[21]పర్ణశాలల పండుగ సమీపముగా ఉండగా (యోహాను 7:2), యెరూషలేములో గాక ఆ పర్వతమునొద్దనే పర్ణశాలల పండుగ చేయవచ్చునని పేతురు అన్నట్టు కొందరు ఊహించారు. [22]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing co., 1914), 419. [23]అనేక ఆత్మసంబంధమైన నాయకులలో యేసు ఒకడని నమ్ముతారు కాని, యేసు ప్రభువు, దేవుడు (దైవం) అని నమ్మరు. [24]క్రొత్త నిబంధన ధర్మశాస్త్రం స్థానంలో వచ్చే మార్గంలో ఉంది (కొలస్సీ 2:14; హెబ్రీ. 9:16,17) – ఈ దినములలో దేవుడు కుమారుని ద్వార మనతో మాట్లాడుచున్నాడు (హెబ్రీ. 1:2ఎ). [25]ఈ అలంకార రూపం మీ చదువరులకు పరిచయమైన దానిని ఉపయోగించాలి.

